క్లుప్తంగా

ఆంజనేయుడికి ఆకుపూజలు



తర్లుపాడు: మండలంలోని చెన్నారెడ్డిపల్లిలో వీరాంజనేయస్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకలను గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి గణపతి పూజ, పంచామృతాభిషేకం, ఆకుపూజలు చేశారు. అర్చకులు పవన్‌శర్మ, శ్రీరామ్ శర్మలు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. మండలంలోని సీతానాగులవరంలో హనుమాన్ జయంతి సందర్భముగా శ్రీ బాలవీరాంజనేయస్వామికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. సందర్భంగా ఎడ్ల పందేలు నిర్వహించారు. శనివారం సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

చేతిరాతపై గ్రంథాలయంలో శిక్షణ



మార్కాపురం: శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా లయన్స్ క్లబ్ సహకారంతో విద్యార్థులకు హ్యాండ్ రైటింగ్‌పై ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ట్రైనర్ తిరుపాలయ్య నిర్వహించారు. చేతిరాత ప్రాధాన్యతను క్లబ్ అధ్యక్షుడు రామకృష్ణారావు వివరించారు. చక్కని రాతతో మంచి భవిష్యత్ ఉంటుందని, విద్యార్థులకు మంచి మార్కులు కూడా వస్తాయని లైబ్రేరియన్ శివారెడ్డి తెలిపారు. 2 రోజుల శిక్షణా శిబిరాన్ని ఉపయోగించుకోవాలని ఆయన తెలిపారు.

మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు



గిద్దలూరు రూరల్: మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు అమలులో ఉన్నాయని గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ.ఓంకార్ అన్నారు. పని ప్రదేశంలో మహిళలకు లైంగిక వేధింపుల నిషేధ చట్టం 2013 గురించి స్థానిక కోర్టు ఆవరణలో శనివారం న్యాయవాదులను, పారాలీగల్ వలంటీర్లకు ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో జడ్జి మాట్లాడారు. ఈ చట్టం ప్రాధాన్యతను తెలియజేస్తూ మహిళలు పూర్తి స్వేచ్ఛతో పనిప్రదేశాల్లో నిర్భయంగా పనిచేసుకునే విధంగా చట్టం అవకాశం కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల న్యాయసేవాధికార సంస్థ పరిధిలోని న్యాయవాదులు, పారా వలంటీర్లు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీ చెన్నకేశవుని శాంతి కల్యాణం



మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి వారి శాంతి కల్యాణం అర్చకులు శనివారం కన్నుల పండువగా జరిగింది. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకుల ఆధ్వర్యంలో అభిషేకాలు, విష్ణు సహస్ర నామ పారాయణం, అర్చన, అష్టోత్తర పూజలు నిర్వహించారు. అలాగే రాజ్యలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలను అర్చకులు నిర్వహించారు. అనంతరం ఉదయం 11గంటలకు ఆలయ మధ్య రంగ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ప్రత్యేక పూల అలకరణలో ఉభయ దేవేరులతో చెన్నకేశవ స్వామి వారి ఉత్సవవిగ్రహాలను ప్రతిష్ఠించారు. కళ్యాణం అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో జీ.శ్రీనివాసరెడ్డి, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సర్వే చేసి రిజిస్ట్రేషన్ చేయించాలి



బేస్తవారిపేట: యోగా మాసోత్సవాల సందర్భంగా ఇంటింకి వెళ్లి సర్వే చేసి యోగాపై ఆసక్తి కనబరిచే వారి వివరాలు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించాలని ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు, తహసీల్దార్ జితేంద్రకుమార్ అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో యోగా మాసోత్సవాలపై మండల స్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండలంలో 200 మందిని ఎంపిక చేశామని, వీరందరికి రెండు రోజుల పాటు యోగా గురువులతో శిక్షణ ఇస్తామన్నారు. ప్రతి సచివాలయంలో ఐదు రోజులు తప్పనిసరిగా యోగా తరగతులు నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని కోరారు.

జాగ్రత్తలే.. పిడుగుకు విరుగుడు

- పిడుగుతో పెను ప్రమాదాలు
- చెట్లకిందకు వెళ్లొద్దంటున్న నిపుణులు
- ఉరుములు, మెరుపుల సమయంలో జాగ్రత్తలు పాటిస్తే మేలు



పిడుగుపాటుతో మృతి చెందిన గేదెలు (ఫైల్)



పిడుగుపాటుతో మృతిచెందిన మేకలు (ఫైల్)



పిడుగుపాటుతో మృతిచెందిన విద్యార్థులు (ఫైల్)

బేస్తవారిపేట: నైరుతి రుతుపవనాలు త్వరగా రానుండటంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి. ఉరుములు, మెరుపుల ప్రభావంతో పిడుగులు పడుతుండటంతో ప్రజలు మృత్యువాత పడుతున్నారు. ఇటీవల జిల్లాలో అక్కడక్కడ పిడుగులు పడుతున్నాయి. ప్రాణ, ఆస్తి నష్టం జరుగుతోంది. వాతావరణంలో మార్పులు ఏర్పడి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తోంది. ఈ సమయంలో ఎక్కడ పిడుగులు పడతాయోనని భయంతో పరుగులు పెడతారు. చెట్లకిందకు చేరడం సర్వసాధారణంగా అందరు చేసే పని. ఇదే కొంపముంచుతోంది. ఇలా చేయడంతో మృత్యువాత పడే అవకాశాలు మెండుగా ఉంటాయి.

చెట్ల కింద వెళ్లడంతో ప్రమాదాలు..

తీవ్ర స్థాయిలో వేసవిలో ఉష్ణోగ్రతలు చేరడంతోపాటు వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. జిల్లాలో ఇటీవల అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వర్షం కురుస్తోంది. పలు చోట్ల ఉరుములతో కూడిన పిడుగులు పడుతున్నాయి. మనుషులతోపాటు మూగజీవాలు పిడుగుపాటుకు గురై మృత్యువాత పడుతున్నాయి. ఈ క్రమంలో పిడుగు మాట వింటేనే భయపడుతున్నారు. మెరుపు మెరిసి బలంగా ఉరిమిందంటే ఎక్కడో ఓ చోట పిడుగు పడే ఉంటుందని పెద్దలు చెప్తుంటారు. ఉరుము ఉరిమిందంటే పొలాల్లోని రైతులు, కూలీలు, పశువులు, గొర్రెలకాపరులు పిడుగు భయంతో చెట్ల చాటుకు పరుగులు తీస్తారు. ఒక్కొక్కసారి అదే వారి ప్రాణం మీదకు తీసుకొస్తుంది. చెట్లు ఎత్తుగా ఉండటంతో పిడుగులు ఎక్కువగా వాటిని ఆకర్షిస్తాయి. ఈ విషయం తెలియక చెట్ల కిందకు వెళ్లి పిడుగుపాటుతో చనిపోయినవారు జిల్లాలో ఉన్నారు. అలాంటి వారిలో రైతులు, రైతు కూలీలు, పిల్లలు ఉన్నారు. అయితే పిడుగులు ఏ ప్రాంతంలో ఏ సమయంలో పిడుగుపడే ప్రమాదం ఉందో కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో గత కొన్నేళ్లుగా ముందుగానే పసిగట్టి తెలియజేస్తున్నారు. సెల్‌ఫోన్‌లకు అలర్ట్ మెసేజ్‌లు రావడంతో కొంతమేరకు నష్ట నివారణ చర్యలు తీసుకోవడానికి వీలు కలుగుతుంది. ముందస్తు జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా వ్యవహరిస్తే పిడుగు ప్రమాదాల నుంచి తప్పించుకోవచ్చు.

పాటించాల్సిన జాగ్రత్తలు..

- వర్షం పడుతున్న సమయంలో ఎట్టి పరిస్థితుల్లో ఎత్తుగా ఉన్న చెట్లు, సెల్ టవర్లు, స్తంభాలు, కొండల వద్దకు వెళ్లకూడదు.
- ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలి. కంప్యూటర్లు, ల్యాప్‌ట్యాప్‌లు, స్మార్ట్‌ఫోన్లు, విద్యుత్ స్టవ్‌లు, ఇతర విద్యుత్ పరికరాలు ఉపయోగించకూడదు.
- వర్షం కురిసినప్పుడు విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గుల విషయాల్లో జాగ్రత్తగా ఉండాలి.
- ఉరుములతో కూడిన వర్షం వస్తున్నప్పుడు నీటితో కూడిన పనులు చేయకూడదు.
- గుంపులుగా ఉండకుండా దూరంగా ఉండాలి. ముఖ్యంగా పొలాల్లో పనిచేయడం, పశువులను మేపడం, చేపలు పట్టడం వంటివి చేయకూడదని నిపుణులు చెబుతున్నారు.

జరిగిన ఘటనలు..

- ఏప్రిల్ 20వ తేదీన బేస్తవారిపేట మండలంలోని పెద్ద ఓబినేనిపల్లె క్రికెట్ ఆడుకునేందుకు వెళ్లి ఇద్దరు విద్యుర్థులు ఆకాష్, సన్నిలు పిడుగుపాటుకు మృత్యువాత పడ్డారు. వర్షం రావడంతో చెట్టు కిందకు చేరడంతో పిడుగుపడి అక్కడికక్కడే మృతిచెందారు. గొర్రెల కాపరి తిరుపతయ్య స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.
- ఏప్రిల్ 30న కంభం మండలం హజరత్‌గూడెంలో వెంకటేశ్వర్లుకు చెందిన పిడుగుపాటుతో రెండు గేదెలు మృతి చెందాయి.
- మే 2వ తేదీన కనిగిరి మండలం కలగట్ల సమీపంలో నూకపోటి శివపార్వతమ్మకు చెందిన గొర్రెల మందపై పడిగుపడటంతో 20 మేకలు మృతి
- కొమరోలు మండలం తాటిచర్ల మోటులో గుమ్మళ్ల శింగరయ్యకు చెందిన రెండు గేదెలు, రెండు దూడలు పిడుగుపడి మృత్యువాత పడ్డాయి
- మే 4న నాగులుప్పలపాడు మండలం ఈదుమూడికి చెందిన కొండపి నాగమల్లేశ్వరరావు పిడుగుపాటుతో మృతి.
- ఏప్రిల్ 4న కొమరోలు మండలం ఎడమకల్లులో ఎం యాకోబుకు చెందిన మూడు గేదెలు పిడుగుపాటుకు గురై మృతి.
- ఏప్రిల్ 16న అర్ధవీడు మండలం యాచవరంలో పొలంలో పనిచేస్తున్న కూలీలపై పిడుగు పడటంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు.

జగనన్న పర్యటనను విజయవంతం చేద్దాం!



పొదిలి సమావేశంలో మాట్లాడుతున్న అన్నా రాంబాబు

- కార్యకర్తల సమావేశంలో అన్నా రాంబాబు, ఉడుముల



మాట్లాడుతున్న ఉడుముల నారాయణరెడ్డి

పొదిలి రూరల్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 28వ తేదీ పొదిలి పొగాకు వేలం కేంద్రం పర్యటనను విజయవంతం చేయాలని మార్కాపురం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అన్నా వెంకట రాంబాబు కోరారు. శనివారం పొదిలి విశ్వనాథపురంలోని వివేకానంద జూనియర్ కాలేజీలో మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డితో కలిసి పొదిలి, కొనకనమిట్ల మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలుకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్నదాతలు పండించిన కంది, మిరప, వరి, పొగాకు పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వపోవడంతో రైతులు తీవ్ర నష్టాల బాట పట్టారన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు మద్దతు ధర కల్పించి అన్నదాతలకు అండగా నిలబడ్డరని గుర్తు చేశారు. ఉడుముల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు దాటిన ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. నష్టాల్లో ఉన్న రైతులు కష్టాలు తెలుసుకేనేందుకు ఈ నెల 28న ఉదయం 9.30 గంటలకు జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్న తరుణంలో పార్టీ శ్రేణులు బారీగా తరలి వచ్చి రైతులకు అండగా నిలవాలని కోరారు. అనంతరం హెలిప్యాడ్ స్థలాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంటు పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, నాయకులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కేవీ రమణారెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, మెట్టు వెంకటరెడ్డి, ఉడుముల గురువారెడ్డి, సాయి రాజేశ్వరరావు, కె నరసింహరావు, ఎం మురళీ,కొత్తపులి బ్రహ్మారెడ్డి, ఫిరోజ్, మోరా శంకర్‌రెడ్డి, కామాసాని వెంకటేశ్వరరెడ్డి, అక్కిదాసరి ఏడుకొండలు, అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దు



మార్కాపురంలో సబ్ జైలును పరిశీలిస్తున్న ఇబ్రహీం షరీఫ్

మార్కాపురం: నేరాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ షేక్ ఇబ్రహీం షరీఫ్ పేర్కొన్నారు. శనివారం మార్కాపురం సబ్‌జైలును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడుతూ న్యాయ సహాయం కావాల్సిన వారు మండల లీగల్‌సర్వీస్ అథారిటీని సంప్రదించాలని కోరారు. వంటశాల, స్టోర్‌రూమును పరిశీలించారు. ఈయన వెంట మండల లీగల్ సెల్ అథారిటీ సూపరింటెండెంట్ లక్ష్మీనారాయణ, న్యాయవాది ఉషశ్రీ, షేక్ బాషా, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: పట్టణంలోని సబ్ జైలును జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.కె.ఇబ్రహీం షరీఫ్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులోని ఖైదీలను వారికి కలిప్తున్న వసతులను గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ.ఓంకార్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.భరత్, జైలు సూపరింటెండెంట్ లింగారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

డిజైన్ స్లేట్ కార్మికుల సమ్మె విరమణ



ఒప్పంద ప్రతాలు చూపుతున్న యజమానులు, కార్మిక సంఘం నాయకులు

మార్కాపురం: పట్టణంలోని డిజైన్ స్లేట్ కార్మికుల చర్చలు విజయవంతంగా జరిగాయని.. కార్మికుల కూలీలను యజమానులు పెంచారని దీనితో సమ్మె విరమించినట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ, డిజైన్ స్లేట్, మజాయిక్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి పి రూబెన్ తెలిపారు. శనివారం యజమానులతో జరిగిన చర్చల్లో ఈమేరకు ఒప్పందం జరిగినట్లు తెలిపారు. కూలీలు పెంచాలని ఈ నెల 4 నుంచి కార్మికులు సమ్మెలో ఉన్నారు. శనివారం ఎస్టేట్‌లోని ఓనర్స్ అసోషియేషన్ కార్యాలయం వద్ద జరిగిన చర్చల్లో కూలీలు పెరిగాయన్నారు. ఆపరేటర్‌కు రూ.297 నుంచి రూ.329, హెల్పర్‌కు రూ.294 నుంచి రూ.326, చీల్పులు చేసే కార్మికులకు రూ.320 నుంచి రూ.350, ముజాయిక్ కార్మికులకు పాతరేటు మీద 11 శాతం పెంచారన్నారు. కాలిబ్రేషన్ కార్మికులకు రూ.150 నుంచి రూ.166 పెంచారన్నారు. ఈ అగ్రిమెంటు 2 సంవత్సరాలు అమలులో ఉంటుందన్నారు. యజమానుల తరుపున వెన్న పోలిరెడ్డి, గుప్తా ప్రసాద్, వై కోటేశ్వరరావు, ఎంవీ రామ్స్, ఎం వెంకటరెడ్డి, టి రాములు, వెంకటేశ్వరరెడ్డి, ప్రకాష్, రూబెన్ తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

సచివాలయం తనిఖీ



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో

కంభం: మండలంలోని ఎల్‌కోట గ్రామ సచివాలయాన్ని శనివారం ఎంపీడీవో వీరభద్రాచారి తనిఖీ చేశారు. హాజరుపట్టి, మూవ్‌మెంట్ రిజిస్టరు, ఇతర రికార్డులు పరిశీలించారు. యోగాంధ్ర సర్వేపై సిబ్బందికి సూచనలందించారు. గ్రామంలో జరుగుతున్న సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఎన్‌జీవో హోమ్‌లో జరుగుతున్న కుట్టుమిషన్ల శిక్షణా కేంద్రాన్ని పరిశీలించారు.

ఆలయాల్లో భక్తుల సందడి

కొనకనమిట్ల: మండలంలోని ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. ఆలయ అర్చకులు సింహాద్రిచార్యులు లక్ష్మీఅలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు విశేష పూజలు నిర్వహించారు.

పోరుబాటకు మద్దతుగా నిలవాలి



కంభంలో మాట్లాడుతున్న చెన్నారెడ్డి



బేస్తవారిపేటలో మాట్లాడుతున్న ఎంపీపీ ఓసూరారెడ్డి



అర్ధవీడులో సమావేశమైన నాయకులు



గిద్దలూరులో కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

గిద్దలూరు రూరల్: పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే పోరుబాట కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, రైతులు అండగా నిలవాలని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ నెల 28 వ తేదీన పొదిలిలో పొగాకు రైతులకు మద్దతుగా పోరుబాట కార్యక్రమం నిర్వహిస్తున్న సందర్భంగా గిద్దలూరు ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద నాయకులు శనివారం పోరుబాట కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నగర పంచాయతీ అధ్యక్షుడు మానం బాలిరెడ్డి మాట్లాడుతు పొదిలిలో రైతన్నలకు అండగా జగనన్న పోరుబాట కార్యక్రమం తలపెట్టాడని, కార్యక్రమానికి ప్రతి కార్యకర్త తప్పకుండా హాజరుకావాల్సిందిగా ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ భూమా నరసింహారెడ్డి, ఓబులరావు, పాలుగుళ్ల నరసింహారెడ్డి, కాతా నరసింహారెడ్డి, నంద్యాల బాలుయాదవ్, బొర్రా క్రిష్ణారెడ్డి, చేరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, నాసరి శ్రీను, పోలేపల్లె శివ, గఫూర్, తదితరులు పాల్గొన్నారు.

అర్ధవీడు: పొగాకు రైతులకు మద్దతు తెలిపేందుకు ఈనెల 28న పొదిలి వస్తున్న మాజీ సీఎం జగన్ పర్యటనను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఏరువ రంగారెడ్డి పేర్కొన్నారు. శనివారం అర్ధవీడు మండల నాయకులతో కలసి ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. మండలం నుంచి అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు నన్నెబోయిన రవికుమార్, సర్పంచులు దండుగ వెంకటేశ్వరరెడ్డి, మునగాల వసంతమ్మ, నాయకులు చేగిరెడ్డి పోతిరెడ్డి, రావిపాటి రమేష్ రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ పర్యటనను విజయవంతం చేద్దాం

కంభం: పొగాకు రైతులకు సంఘీభావంగా మాజీ సీఎం జగన్ పొదిలి పర్యటనను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తరలి రావాలని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ నెమలిదిన్నె చెన్నారెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని 14 పంచాయతీల నాయకులతో కలసి కంభంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గొంగటి చెన్నారెడ్డి, నాయకులు చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి,మహబూబ్ పీరా, సబ్బసాని సాంబశివారెడ్డి, రామ్మూర్తి, రఫి, ఆనంద్, పెద్దకోటేశ్వరరావు, హుస్సేన్‌బాషా, ఆరీఫ్, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, చలువాది రమణ, నాగభూషణం, రామసుబ్బారెడ్డి, బిక్కా వెంకటరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బేస్తవారిపేట: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈనెల 28న పొదిలి పొగాకు వేలం కేంద్రం సందర్శనను విజయవంతం చేయాలని ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కేపీ నాగార్జున ఆదేశాల మేరకు పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బీవీ రాజయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు వెన్నా భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ మల్లెల శేఖర్‌రెడ్డి, నాయకులు దప్పిలి సంభూతరెడ్డి, మాచర్ల వెంకటేశ్వరరెడ్డి, శ్రీరాములు పాల్గొన్నారు.

వేడుకగా అభయాంజనేయస్వామి గ్రామోత్సవం



సువర్చలా ఆంజనేయ స్వామి



సత్య హరిచ్చంద్ర నాటకంలోని దృశ్యం

కొనకనమిట్ల: హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గొట్లగట్టు గ్రామంలో శుక్రవారం రాత్రి అభయాంజనేయస్వామి, సువర్చలాదేవి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన ఒంటె వాహనంలో గ్రామోత్సవం నిర్వహించారు. పుష్కలంగా వర్షాలు కురిసి గ్రామం పాడి పంటలతో సుభిక్షింగా ఉండాలని గ్రామస్తులు మొక్కుకున్నారు. ఈసందర్భంగా గొట్లగట్టు అభయాంజనేయస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సత్య హరిశ్చంద్ర పౌరాణిక నాటకం ఆహుతులను అలరించింది. నాటకంలోని హరిశ్చంద్రుని, చంద్రమతి, నక్షత్రకుడు, సత్యకీర్తి, వీరబాహుడు పాత్రలు అలరించాయి. అడవి సీను, వారణాసి, కాటిసీనులు ఆద్యంతం ప్రేక్షకులను అలోచింపజేసింది.

కార్గో సేవలపై ఆర్టీసీ దృష్టి



కార్గో సర్వీసులను ప్రారంభిస్తున్న డీఎం

కొమరోలు: ఏపీఎస్ఆర్టీసికి ఆదాయ వనరులైన కార్గో ట్రాన్స్‌పోర్టు సేవలపై ఆర్టీసీ సంస్థ దృష్టి సారించినట్లుగా గిద్దలూరు ఆర్టీసీ డిపో మేనేజర్ చంద్రశేఖర్ తెలిపారు. కొమరోలులోని వేంకటేశ్వర మీ సేవా కేంద్రంలో డిపో మేనేజర్ చంద్రశేఖర్ కార్గో సేవలను శనివారం పునఃప్రారంభించారు. ఈసందర్భంగా డీఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ గిద్దలూరు ఆర్టీసి డిపో పరిధిలోని కొమరోలు, గిద్దలూరు, కంభం, బేస్తవారపేట, రాచర్ల, అర్ధవీడు మండలాల్లో కార్గో సర్వీసులు నడుస్తున్నాయని తెలిపారు. సుదూర ప్రాంతాలైన హైదరాబాద్, వైజాగ్, విజయవాడ ప్రాంతాలకు రెండు రోజుల్లోనే పార్సిల్స్‌ను ప్రైవేటు సంస్థల కంటే వేగంగా చేరుస్తారని, కార్గో సర్వీసులను ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు. వీరి వెంట డీసీఈ మల్లేశ్వర్‌రెడ్డి ఉన్నారు.